క్లుప్తంగా

జాతీయజెండాలతో ప్రదర్శన



జెండాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో బుధవారం జాతీయ జెండాలను ప్రదర్శించారు. ప్రతీ తపాలా కార్యాలయంలో రూ.25లకే జాతీయ జెండాలు విక్రయిస్తారని ప్రజలు కొనుగోలు చేయాలని సూచించారు. నిర్మల్ సబ్‌డివిజన్ అధికారి షఫీఉద్దీన్, సబ్‌పోస్ట్ మాస్టర్ రాజేందర్, ఎంవో సాజన్‌సింగ్, సిబ్బంది, నాయకులు ఉన్నారు.

సదర్మాట్ రైతులకు సాగునీరందేలా కృషి

ఖానాపూర్: సొంత ఖర్చులతో ఖానాపూర్, తిమ్మాపూర్ ప్రాంతంలోని సదర్మాట్ రైతులకు సాగునీరందేలా చూస్తానని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ తెలిపారు. గతకొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు కాలువకు పలుచోట్ల గండ్లు పండి రైతులకు సాగునీటి విడుదలపై స్పష్టత లేకుండా పోయింది. ప్రస్తుతానికి తిమ్మాపూర్, ఖానాపూర్ ప్రాంత రైతులకు నీరందేలా చర్యలు తీసుకుంటానని, వారంలోగా ప్రభుత్వం స్పందించి గండ్లు పూడ్చివేయించాలని లేకపోతే తానే వాటిని పూడ్చివేయిస్తానని మాజీ ఎంపీ ప్రకటించారు. బుధవారం ఆయన చొరవతో రూ. 30వేలకు పైగా వెచ్చించి గాంధీనగర్ ప్రాంతంలో కాలువకు అడ్డుకట్టకు వేయించారు. మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు మైలారపు గంగాధర్, దాసరి పోశులు, చిలుకూరి గంగాధర్, లాండేరి గోపి, జీవన్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలందిస్తేనే గుర్తింపు



జమీల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, ఉత్తమ సేవలందిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సర్పంచ్ కనీస్ ఫాతిమా పేర్కొన్నారు. ఓలా ఉర్దూ మీడియం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జమీల్ అహ్మద్ ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకాగా బుధవారం పాఠశాలలో ఆయన్ను సన్మానించారు. హెచ్ఎంలు సునీల్‌రెడ్డి, సాజిద్ మిరాజ్, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ యూనుస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ మహిపాల్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు భోజారెడ్డి, నాయకులు అబ్దుల్ హాదీ, ఉట్ల రాజేశ్వర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సిరాలకు తాత్కాలిక రోడ్డు

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామానికి బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ తాత్కాలిక రోడ్డును ఏర్పాటుచేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు కట్ట పూర్తిగా తెగిపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. సిరాల గ్రామంలో పవార్ రామారావుపటేల్ పర్యటించి బాధితులను కలిసి మాట్లాడారు. సుమారు రూ.30 వేల ఖర్చుచేసి తాత్కాలికంగా రోడ్డు సౌకర్యం కల్పించి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చారు. గ్రామస్తులు రామారావుపటేల్‌ను అభినందించారు.

దెబ్బతిన్న రోడ్లు పరిశీలన

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను, రోడ్లను బీఆర్ఎస్ నాయకుడు జీవీ రమణారావు బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తమ గ్రామాన్ని దత్తత తీసుకున్న సమస్యలు పరిష్కరించలేదని గ్రామస్తులు వాపోయారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. నాయకులు రవీందర్‌రావు, బక్కి భోజన్న, దోనిగామ రాజు, ఒడ్నం రమేశ్, ప్రవీణ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్: సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎండీ జాకీర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆర్ఐ గంగన్న, వెంకటనర్సయ్య ఉన్నారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

- అడుగడుగునా గుంతలు
- రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల రోడ్లు ఛిద్రమై కొట్టుకుపోయాయి. ఫలితంగా రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక అవే రోడ్లపై వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రోడ్లు ఛిద్రమైన మరమ్మతుపై అధికారులు పట్టించుకోవడం లేదు. లోకేశ్వరం–పెండ్‌పల్లి రోడ్డు సాథ్‌గాం సమీపంలో బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పుస్పూర్–బోరిగాం గ్రామాల మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రయాణం సాగించాలంటే ప్రజలు భయపడుతున్నారు. పుస్పూర్ సమీపంలోని రోడ్డుపై నడవడానికి కూడా వీల్లేకుండా ఉంది.

పట్టింపు కరువు..

ఈ రోడ్లపై నిత్యం ఎంతోమంది ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా రోడ్ల దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



సుద్దవాగు ఉధృతికి కొట్టుకుపోయిన పుస్పూర్-బోరిగాం రోడ్డు



కొట్టుకుపోయిన పెండ్‌పల్లి-సాథ్‌గాం తారురోడ్డు

నిధులు కేటాయించాలి



వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారైంది. మరమ్మతు చేపకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే పనులు చేట్టాలి.

– మంద శ్రీధర్, ధర్మోర

మా గోడు వినాలి



మా ఊరు అందరూ వ్యవసాయదారులే. పురుగు మందు, ఎరువులు కొనాలన్నా పండిన పంటలు విక్రయించాలన్నా భైంసా మార్కెట్‌కు వెళ్లాలి. మా ఊరి పక్కనే సుద్దవాగుపై వంతెన ఉన్నా సరైన రహదారి లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం మా గోడు విని మా కష్టాలు తీర్చాలి.

– పోతారెడ్డి, పుస్పూర్

ప్రతిపాదనలు పంపించాం

పుస్పూర్–బోరిగాం, సాథ్గాం–పెండ్‌పల్లి వంతెన వరకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉంది. రోడ్లపై గుంతలు ఏర్పడాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే వెంటనే లోకేశ్వరం–బోరిగాం రహదారికి తారు రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– చందులాల్, నిర్మల్ పీఆర్ డీఈ

బాసర ట్రిపుల్‌ఐటీపై కుట్రలు

- కాంగ్రెస్ నేత కూచాడి శ్రీహరిరావు



మాట్లాడుతున్న కూచాడి శ్రీహరిరావు

నిర్మల్: ప్రైవేటు డీమ్డ్‌వర్సిటీని ప్రారంభించేందుకే బాసర ట్రిపుల్ ఐటీపై రాష్ట్ర సర్కారు కుట్రలు చేస్తోందని, ఇందులో భాగంగానే ఇక్కడి సమస్యలను, విద్యార్థుల ఆత్మహత్యలనూ లెక్కచేయడం లేదని కాంగ్రెస్ నియోజకవర్గ నేత కూచాడి శ్రీహరిరావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ తొమ్మిదేళ్లలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా సీఎం కేసీఆర్ కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేద విద్యార్థులు ఉన్నతవిద్య చదువుకునేందుకు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేస్తే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఈ విద్యాలయాన్ని నాశనం చేసే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇక్కడి ఆర్జీయూకేటీని నాశనం చేసి, ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నారని చెప్పారు. వరుస ఆత్మహత్యలు జరుగుతుంటే వర్సిటీ అధికారులు ఏం చేస్తున్నారని, ఇన్‌చార్జి వీసీ ఎందుకు అందుబాటులో ఉండటం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విద్యార్థుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్ వెంటనే స్పందించి అఖిలపక్ష నాయకులను ట్రిపుల్ ఐటీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు.

అమానుషం..

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తాము చేసిన ఆందోళనపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని శ్రీహరిరావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ చేసిన నిరసనలో తమ నాయకులపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వాహిద్ ఖాన్, నాందేడపు చిన్ను, గాజుల రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్య నేపథ్యంలో ట్రిపుల్‌ఐటీ ముట్టడికి బయల్దేరిన బీజేపీ నేతలను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎస్సై ఆర్.శంకర్ ఆదేశాల మేరకు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, నాయకులు పాలసాని అనిల్‌రావు తదితరులున్నారు.

లక్ష్మణచాంద: బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండల అధ్యక్షుడు పోలాస గోవర్దన్, ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాపాని గంగాధర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, సర్పంచ్ ముత్యంరెడ్డి, రామ్‌రెడ్డి, చిన్నయ్య, గంగాధర్, రవి, దశగౌడ్ ఉన్నారు.

సోన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బబ్లూ మృతదేహాన్ని చూసేందుకు వెళ్తున్న బీజేపీ మండల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమ్‌కుమార్, రాచకొండ సాగర్, మేకల అశోక్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో జాప్యం

- ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- మామడ మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

మామడ: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతు చేయించకపోవడం, బిగించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సరఫరాకు అంతరాయంతో రైతులు సాగుచేసిన పంటలకు నీరందక నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. మామడలో మండల అధ్యక్షురాలు రాథోడ్ అమృత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో బాలయ్య సమాధానమిచ్చారు. పోతారంలో అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగేళ్లుగా పోస్టు ఖాళీగా వెంటనే భర్తీ చేయాలని సర్పంచ్ లక్ష్మీనారాయణ అన్నారు. మామడలో వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, తొలగించి నూతన ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని, పీహెచ్‌సీలో ఆదివారం రాత్రి సమయంలో వైద్యసేవలు సరిగా అందడం లేదని సర్పంచ్ హన్మాగౌడ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని గుట్టల మీది గ్రామాల్లో పశువులకు చికిత్స అందించేందుకు సిబ్బంది సంఖ్య పెంచాలని గాయిద్‌పల్లి సర్పంచ్ రాందాస్ కోరారు. గృహలక్ష్మి పథకానికి కుల, ఆదాయ ధ్రువపత్రాల తప్పనిసరి కావడంతో దరఖాస్తుదారులకు సకాలంలో పత్రాలు ఇచ్చేలా చూడాలని దిమ్మదుర్తి ఎంపీటీసీ పడాల శ్రీనివాస్ కోరారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్ మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



సోన్: పాక్‌పట్లలో భీంవిగ్రహానికి నివాళి



దస్తురాబాద్‌లో..

ఖానాపూర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో భీం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ నేత బుక్యా జాన్సన్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావు, నాయకులు ఉన్నారు.

లోకేశ్వరం: పుస్పూర్, ధర్మోర, పంచగుడి, జోహర్‌పూర్, లోకేశ్వరం తదితర గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన వీదుల గుండా ఆదివాసీలు ర్యాలీని నిర్వహించారు. భీం విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం నర్సయ్య, ఆదివాసీల సంఘం మండల అధ్యక్షుడు గంజాల గంగాధర్, నాయకులు మక్కుజీ, గంగాధర్, సునీల్, సతీశ్, సాయినాథ్, నర్సయ్య ఉన్నారు.

మామడ: పొన్కల్ గ్రామంలో కుమురం భీం విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. నాయక్‌పోడ్ సంఘం నాయకులు శ్రీనివాస్, భీమేష్, అర్జున్, గంగాధర్, శ్రీనివాస్ ఉన్నారు.

సోన్: పాక్‌పట్ల గ్రామంలో భీం విగ్రహానికి ఆదివాసీలు, ఇతర నేతలు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ నాయక్ పోడ్ సంఘం, ఆదివాసీ నాయక్‌పోడ్ యూత్ సంఘ సభ్యులు, సర్పంచ్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద మండల తుడుందెబ్బ ఆధ్వర్యంలో భీం విగ్రహానికి పూలమాల వేశారు. అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి కిరణ్, సభ్యులు రాజేందర్, జంగు, సోము, దేవురావ్, జలపతి పాల్గొన్నారు.

కడెం: తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఉర్వేత ఆనంద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భీం విగ్రహానికి పూలమాల వేశారు. ఎంపీపీ అలెగ్జాండర్, అర్క మధు, తదితరులు ఉన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పెంచాలి

సారంగపూర్: ప్రభుత్వం గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు కేవలం మూడు రోజులే ఇవ్వడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు శ్రీహరిరావు అన్నారు. బుధవారం ఆయన స్వర్ణ, సారంగాపూర్ గ్రామాల్లో పర్యటించి విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల దరఖాస్తుల గడువు 15 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. ఇళ్ల దరఖాస్తుల విషయంలో ఇంటిస్థలం మహిళల పేరున ఉండాలని నిబంధనతో ఇప్పటికిప్పుడు వారి పేరిట పట్టామార్పిడి చేయడం కుదురుతుందా అని ప్రశ్నించారు. ఇంట్లో ఎవరి పేరున భూమి ఉన్నా సదరు కుటుంబానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. ఇటీవల తహసీల్దార్ల బదిలీ ప్రక్రియ పూర్తి కాగా, ఇంకా డిజిటల్ సైన్ అప్‌డేట్ కాకపోవడంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దశరథ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి)లో 892 దరఖాస్తులు

నర్సాపూర్(జి): గృహలక్ష్మి పథకంలో భాగంగా గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారం నాటికి 892 మంది దరఖాస్తులు వచ్చాయని ఎంపీపీ కార్యాలయ సూపరింటెండెంట్ అనంత విశ్వేశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మీ సేవకు పరుగులు..!

- సంక్షేమ పథకాలకు దరఖాస్తులు
- కిటకిటలాడుతున్న ఆన్‌లైన్ కేంద్రాలు
- ఇదే అదనుగా అందిన కాడికి వసూలు



భైంసాలో దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న మీ సేవ కేంద్రం

భైంసాటౌన్: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. గతంలో వృద్ధాప్య పింఛన్ మొదలు, ఇటీవల బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం, మైనార్టీలకు రుణాల పేరిట దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు మీసేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, ధ్రువీకరణ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విధివిధానాల గురించి తెలుసుకోకుండానే దరఖాస్తు చేసుకుంటున్నారు.

మీసేవల్లో కాసుల పంట..!

ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా, మీసేవ నిర్వాహకులకు కాసుల పంట పండుతోంది. ఇటీవల బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం కోసం మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, చాలావరకు కేంద్రాల్లో ఒక్కో దరఖాస్తుదారు నుంచి రూ.150–రూ.200ల వరకు వసూలు చేశారు. ఎలాంటి దరఖాస్తు రుసుం లేకున్నా, ఇష్టారీతిన వసూలు చేశారు. ప్రస్తుతం గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండగా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉండడంతో మీసేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొందరు త్వరగా ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామంటూ వసూళ్లు చేపడుతున్నారు. దరఖాస్తు రుసుం సైతం కొన్నిచోట్ల అదనంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీసేవ కేంద్రాలపై పర్యవేక్షణ లేకనే ఇష్టారీతిన అదనపు వసూళ్లు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటించి క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ చారి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామలక్ష్మణ్, జిల్లా కార్యదర్శి హరిత, జిల్లా అధ్యక్షుడు రాజేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజమణి, శైలజ, విజయ, గంగామణి, జిల్లా సహాయ కార్యదర్శి రాధ, జిల్లా కమిటీ సభ్యులు వెస్లీ, పోశెట్టి, రవి, మహేశ్, పోశెట్టి, ఆకాశ్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగసభ జయప్రదం చేయండి

భైంసారూరల్: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 12న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కొండన్నగారి కృష్ణారావు కోరారు. మండలంలోని తిమ్మాపూర్‌లో ఉపాధ్యాయ ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాత పెన్షన్ ఆవశ్యకతను గురించి వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 లక్షల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఉన్నారని, వీరందరూ నూతన పెన్షన్ విధానం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నాయకులు భీమేశ్, ఎల్లన్న, ఉమారాణి, డేవిడ్, మాయాదేవి, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు మంత్రి ఐకేరెడ్డి పర్యటన

మామడ: మండల కేంద్రంలో రాష్ట్రమంత్రి ఐకేరెడ్డి గురువారం పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాకాల చంద్రశేఖర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

చెక్‌డ్యాం నిర్మాణాలకు నిధులు మంజూరు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, పోట్‌పల్లి, సాథ్గాం గ్రామాల సమీపంలోని సుద్దవాగుపై చెక్‌డ్యాంలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ సభ్యురాలు లోలం కళావతి తెలిపారు. పుస్పూర్ చెక్‌డ్యాం నిర్మించేందుకు నీటిపారుదల శాఖ నుంచి రూ.8.50 కోట్లు, పోట్‌పల్లిలో రూ.6.70 కోట్లు, సాథ్‌గాంకు రూ.8.27 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోతన్న అత్త అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని జెడ్పీ మాజీ చెర్మన్ లోలం శ్యాంసుందర్ బుధవారం పరామర్శించారు.

జూనియర్ కళాశాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో పరుశురాంనాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల కళాశాలకు రూ.50 వేల విలువైన ఫిల్టర్ వాటర్ ప్లాంట్ బహూకరించిన ఎన్ఆర్ఐ వింజామర విజయ్‌ని అభినందించడంతోపాటు అతని సోదరుడు రాజును బుధవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ హామిద్ ఉన్నారు.

బలవంతపు వసూళ్లు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్–వెంకటాపూర్ మార్గంలో పలువురు మహిళలు బలవంతపు వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. జీన్స్, చొక్కాలు ధరించిన ఐదుగురు మహిళలు ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులను బుధవారం ఆపి వారి నుంచి బలవంతంగా డబ్బులు వసూళ్లు చేశారు. దీంతో కొందరు వారిని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై సీఐ పురుషోత్తం మాట్లాడుతూ వారంతా హిజ్రాలని, డబ్బులు యాచించారని చెప్పారు. విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

నర్సాపూర్(జి): తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.గజానన్‌ను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బుధవారం సన్మానించారు. సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేశ్ ఉన్నారు.

తానూరు: తహసీల్దార్ బిజలీ రవిని బీఆర్ఎస్ మండల నాయకులు సన్మాంచారు. మండల అధ్యక్షుడు పోతారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ దిగాంబర్ పటేల్, మైనార్టీ నాయకులు మౌలాఖాన్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముధోల్: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు నిర్వహించే సమావేశానికి సర్పంచులు, అధికారులు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

సోన్: మండలంలోని కడ్తాల్‌లోని జెడ్పీ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 బాల,బాలికలకు టెన్నికాయిట్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ బి.మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు.

జాన్సన్‌నాయక్‌కు సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో బీఆర్ఎస్ నియోజకవర్గ నేత బుక్య జాన్సన్‌నాయక్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయన్ను సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, మాజీ ఉప సర్పంచ్ సుమన్ ఉన్నారు.

ధూప దీపనైవేద్య ప్రొసీడింగ్ అందజేత

లక్ష్మణచాంద: వడ్యాల్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం ధూపదీప నైవేద్యాల కింద ఎంపికైంది. ఆలయ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్‌కు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం సంబంధిత ప్రొసీడింగ్స్‌ను అందించారు. బీఆర్ఎస్ నాయకులు, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన

తానూరు: మండలంలోని ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నమూనా పోలింగ్ నిర్వహించి, ఓటింగ్, ఎన్నికలపై విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం మురళి మాట్లాడుతూ ఓటు హక్కుతో నాయకులను ఎలా ఎన్నుకుంటారనే విషయాన్ని వివరించారు. విద్యార్థులను అభ్యర్థులుగా బరిలో దింపి ఓటు నమోదు ఆధారంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు. ఉపాధ్యాయులు సుభాష్, నితిన్, గణపతి, దేవిదాస్, రవి, జోతి పాల్గొన్నారు.

'దేశరక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిది'

భైంసాటౌన్: దేశరక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. మేరా మిట్టి మేరా దేశ్ అమృత్ మహోత్సవాల్లో భాగంగా బుధవారం పలువురు మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగనాథ్, రావుల పోశెట్టి, సంపత్‌పటేల్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మండలకేంద్రంలో పదవీ విరమణ పొందిన సైనికులు కందగిరి శ్రీధర్, రాకేశ్, తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబ సభ్యుడు గొండోజి సంతోష్‌లను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్, జిల్లా కార్యదర్శి రాజేందర్, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్ పాల్గొన్నారు.